ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 10 సెప్టెంబరు 2024



పెరిగిన మిర్చి కొనుగోళ్లు

- ధర పెరుగుదలపై రైతుల ఆశలు
- గత వారంలో రూ.3 వేల వరకు పెరుగుదల
- ఇతర రాష్ట్రాల్లో దెబ్బతిన్న పంటలు
- బంగ్లాదేశ్‌లో అల్లర్లు... చైనాలో తుఫాన్‌తో అక్కడ కూడా నష్టం
- ఎగుమతులకు డిమాండ్ పెరిగే అవకాశం
- గుంటూరు జిల్లాలోనే 70 లక్షల మిర్చి టిక్కీల నిల్వ



గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పెరుగుదలపై రైతాంగం పెట్టుకొన్న ఆశలు చిగురిస్తున్నాయి. ఎండు మిరపకాయలు ఎగుమతి జరిగే దేశాలు, రాష్ట్రాల్లో ఈ ఏడాది వేసిన పంట 50 శాతం పైగా వివిధ కారణాలతో దెబ్బతినడంతో అందరి చూపు గుంటూరులోని శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉన్న మిర్చిపై పడింది. గతవారం నుంచి కొనుగోళ్లు పెరిగాయి. ధర కూడా క్వింటాల్‌కు రూ.3వేల వరకు పెరిగినట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మిర్చిరేటు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరూ తొందరపడి తక్కువ ధరకు మిర్చిని అమ్ముకోవద్దని రైతులకు సూచిస్తున్నారు.

గత ఏడాది మిర్చి విస్తీర్ణం పెరగడం, చైనా, బంగ్లాదేశ్‌లకు ఎగుమతులు నిలిచిపోవడంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధర పతనం అయింది. దాదాపుగా సగానికి సగం పడిపోయింది. ఒకానొక దశలో తేజ వెరైటీ మిర్చి క్వింటాల్‌కు రూ. 28 వేల వరకు ధర లభించగా వారం క్రితం వరకు రూ. 15 వేల వరకు మాత్రమే ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే ధర తగ్గడంతో రైతులు చాలామంది గుంటూరు పరిసరాల్లోని 99 కోల్డ్‌స్టోరేజ్‌లలో సరుకు నిల్వ చేశారు. దీంతో గత జూన్ నెల రెండో వారంలో ఆయా స్టోరేజ్‌లలో దాదాపుగా 90 లక్షల మిర్చి టిక్కీల నిల్వలున్నాయి. ఈ కారణంగా ధర ఏమాత్రం పెరగకుండా స్థిరంగా కొనసాగుతూ వస్తున్నది. జూన్, జూలై, ఆగస్టు నెలలు కలిపి దాదాపుగా 20 లక్షల మిర్చి టిక్కీల వరకు రైతులు విక్రయించేశారు. ఇంకా 70 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నాయని మార్కెటింగ్ శాఖ అధికారవర్గాలు సమాచారాన్ని సేకరించాయి.

గుజరాత్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వలన మిరప పైరుకు సుమారు 50 నుంచి 60 శాతం నష్టం చేకూరిందని అక్కడి ట్రేడ్‌వర్గాల ద్వారా గుంటూరు ఏఎంసీలోని ఎక్స్‌పోర్టర్లకు సమాచారం అందింది. అలానే మహారాష్ట్రలో అధిక వర్షాల వలన మిరప పంట వైరస్ బారిన పడింది. రానున్న రోజుల్లో వర్షాల కారణంగా ఎలాంటి పరిస్థితులు ఉంటాయో తెలియని పరిస్థితి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పచ్చిమిర్చికి గిరాకీ నెలకొనడంతో అక్కడ కోతలు జోరందుకున్నాయి. రానున్న రోజుల్లో అధిక వర్షాల వలన మొక్కలు దెబ్బతింటాయన్న భయాందోళన నడుమ పచ్చిమిర్చి కోతలు మరింతగా పెరిగాయి. మధ్యప్రదేశ్ మిర్చి పండించే ప్రాంతాల్లో వర్షాల కారణంగా సుమారు 15 నుంచి 20 శాతం వైరస్ సమస్యలు మొదలయ్యాయని సమాచారం. భారత దేశంలో అత్యధికంగా మిరప సాగు చేసే రెండు తెలుగు రాష్ట్రాల్లో మిర్చి ధరలు పడిపోయిన కారణంగా ఈ సంవత్సరం 50శాతం సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. గత వారంలో కురిసిన వర్షాలతో నారు అత్యధికంగా దెబ్బతిన్నది. మళ్లీ మిర్చి నారు వేయాల్సిన పరిస్థితి వలన కొత్త పంట రావడానికి డిసెంబరు నెల కావొచ్చు. తెలుగు రాష్ట్రాలలో వాతావరణ శాఖ నివేదికల ప్రకారం అధిక వర్షాల కారణంగా మిరప పంట దిగుబడి కచ్చితంగా తగ్గుతుంది. చైనాలో భిన్న వాతావరణ పరిస్థితుల వలన పంట తొలి దశలో నీరు లేక ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పుడు అధిక వర్షాల కారణంగా కోతల సమయంలో మరిన్ని సమస్యలు తలెత్తాయని సమాచారం అందింది. దీని మూలాన జూలై నెలలో చైనాలో పండే మిరపకు సుమారు 5000 వరకు మిరప రేటు పెరగడం జరిగింది. చైనాలో ఈ వారంలో అతి భయంకరమైన యాగి తుఫాను వలన మిర్చి పంట ధ్వంసమైంది.

ప్రతిరోజు ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు లక్ష బస్తాలు, తెలంగాణలో 50,000, కర్ణాటకలో 25000 మిరప బస్తాలు అమ్మకం మొత్తంగా 1,75,000 బస్తాలు రోజుకు అమ్మకాలు కొనసాగుతున్న నడుమ కొత్త పంట చేతికి వచ్చే సమయం ఆలస్యం అవుతు న్నందున ఇప్పుడున్నటువంటి నిల్వలు సరిపోతాయా లేదా అనే అనిశ్చితి ట్రేడ్‌లో నెలకొంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే మిరపనిల్వలు ఉన్నాయి. వాతావరణ శాఖ అధిక వర్షాల హెచ్చరికల మూలంగా మిరపపంటకు ప్రతికూల పరిస్థితులు తలెత్తడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నిల్వ వున్న మిర్చికి విపరీతమైన డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత వారంలో క్వింటాల్ తేజ వెరైటీ మిర్చి రూ. 15 వేల నుంచి రూ.18వేలకు పెరిగింది. ఇతర వెరైటీల్లోనూ క్వింటాల్‌కు రూ.2వేల వరకు పెరిగినట్లు వ్యాపారస్థులు చెబుతున్నారు. దీనిదృష్ట్యా కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొన్న రైతులు పంటని విక్రయించే విషయంలో ఆచితూచి అడుగులు వేయడం మంచిదని గుంటూరు ఏఎంసీకి చెందిన దిగుమతి వ్యాపారి కర్లపూడి వెంకటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

వెంకటరామిరెడ్డి.. ఎక్కడ?



గత ఐదు సంవత్సరాలలో మాచర్ల నియోజకవర్గం మరో చంబల్ లోయగా పేరు పడింది. అప్పటి ఎమ్మెల్యే అతని సోదరులు చెప్పిందే చట్టంగా పాలన సాగింది. ఇష్టారీతిగా వ్యవహరిస్తూ టీడీపీ కార్యకర్తలు, నాయకులు మీద కేసులు బనాయిస్తూ దమనకాండ సాగించారు. 2019 ఎన్నికల సమయంలో వీరి ప్రోద్బలంతో టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, బోండా ఉమపై బహిరంగంగా దాడి జరిగింది. 2024 ఎన్నిక సమయంలో, ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే సోదరుడు వెంకటరామిరెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతూ దాడులకు పాల్పడ్డాడు. ఈ దాడుల్లో కొందరు పోలీసులు కూడా గాయపడడం గమనార్హం. అయితే 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలవడం, మాచర్లలో టీడీపీ గెలవడం వంటి సంఘటనలతో వెంకటరామి రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్ళారు. అప్పటి వరకు జరిగిన సంఘటనల మీద అతనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అయితే ఇప్పటికీ అతని ఆచూకీ కనుగొనడంలో పోలీసుల వ్యవహారం మీద విమర్శలు వినిపిస్తున్నాయి.



- పోలీసు శాఖకు సవాల్‌గా అరెస్టు
- అధికారం అండతో అరాచకాలు
- పోలీసు శాఖ తీరుపై విమర్శలు

నరసరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి అధికారం అండతో చెలరేగిపోయాడు. నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను తన చెప్పు చేతల్లో పెట్టుకున్నాడు. ప్రత్యర్థి టీడీపీ నేతలు, కార్యకర్తలను కేసులతో అణచి వేశారు. తనకు ఎదురే లేదు అన్న రీతిలో వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి పోలింగ్, ఆ తర్వాత విధ్వంసకాండకు పాల్పడ్డాడు. కేసుల భయంతో మే 14న తన అన్న రామకృష్ణారెడ్డితో కలసి మాచర్లలో హౌస్ అరెస్టు నుంచి పోలీసు కళ్లు కప్పి పరారయ్యాడు. అప్పటి నుంచి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నాడు. అయనను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు పోలీసు అధికారుల సహకారంతోనే అయన తప్పించుకు తిరుగుతున్నాడన్న ఆరోపణలున్నాయి.

మాచర్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున తన అన్న రామకృష్ణారెడ్డితో కలసి వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజు, ఆ తర్వాత హింసాకాండ సాగించారు. పోలింగ్ రోజున వెల్దుర్తి మండలం కండ్లకుంటలో టీడీపీ ఏజెంట్‌గా పోలింగ్ కేంద్రంలో ఉన్న నోముల మాణిక్యరావుపై వెంకట్రామిరెడ్డి వారి అనుచరులు దాడి చేశారు. మాణిక్యరావు ఇంటికి వెళ్లి అయన భార్య, పిల్లలను చితకబాదారు. తిరిగి పోలింగ్ బూత్‌కు వచ్చి పెట్రోలు బాంబులు, బరిసెలతో హత్య చేయబోయినట్టు పోలీసులకు మాణిక్యరావు ఫిర్యాదుతో అయనపై కేసు నమోదైంది. లోయపల్లిలో టీడీపీ కార్యకర్త లపై దాడులకు తెగబడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గొట్టిపాళ్లలో టీడీపీ నేతల గృహాలపై రాళ్లు, సీసా బాటిళ్లు విసిరి భయభ్రాంతులకు గురి చేశారు. టీడీపీ కార్యకర్త రాజబోయిన శ్రీహరికి గాయాలయ్యాయి. జనసేన కార్యకర్త మాదాసు నాగరాజుకు చెందిన బొలేరోకు వైసీపీ మూకలు నిప్పంటించి దగ్ధం చేశాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంలోని 118వ బూత్ లో టీడీపీ ఏజెంట్లు రేఖానాయక్, హనుమంతునాయక్‌లపై దాడి చేశారు. రేఖానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ వెంకయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్లగా వైసీపీ మూకలు అతని పై దాడి చేసి గాయపరిచారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. పట్లవీడులో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ కార్యకర్తలను ప్రశ్నించిన టీడీపీ నేతలపై దాడులు చేశారు. మరసపెంటకు చెందిన టీడీపీ నేత రెడ్యానాయక్ కారు పై వైసీపీ నేతలు రాళ్ల దాడి చేసి ధ్వంసం చేశారు. ఇదే గ్రామంలో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పుల్లారెడ్డి వాహనాన్ని వైసీపీ నేతలు ధ్వంసం చేశారు.

మాచర్ల పట్టణంలో వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజున పట్టణంలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్‌లలో అధికసంఖ్యలో ఓట్లు పోలవడం, ఇవి టీడీపీ సానుభూతిపరులవి కావడంతో ఆగ్రహించిన వెంకట్రామిరెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న టీడీపీ నేతలను కారుతో ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో ఆదూరి అలేఖ్య, ఫిరోజ్, షాజిద్, మల్లెల గోపి (డీజే)లకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఇల్లు, కారును ధ్వంసం చేశారు. ఇంట్లోని ఫర్నీచర్, సామాన్లు ఇంటి నుంచి బయటకు లాగి ధ్వంసం చేశారు. సుమారు 50 మంది టీడీపీ నేతల గృహాల్లోకి వెళ్లి బీభత్సం సృష్టించారు. గంటపాటు ఆ ప్రాంతమంతా అలజడి సృష్టించారు.

కారంపూడిలో వెంకట్రామిరెడ్డి వందలాది మందితో వచ్చి దాడులకు తెగబడ్డాడు. ఈ దాడిలో సీఐ నారాయణ స్వామి కూడా గాయపడ్డాడు. కారంపూడిలో విధ్వంసం సృష్టించాడు. మే 14 నుంచి అయన అచూకీ తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. టీడీపీ కార్యకర్తలు, నేతలను భయభ్రాంతులకు గురిచేసి వారిని గ్రామాల నుంచి వలసలు వెళ్లెలా చేసిన వెంకట్రామిరెడ్డి అరెస్టు భయంతో అజ్ఞాతంలో ఉన్నాడు. అక్రమ కేసులతో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టారు. దాడులు చేసినా వారిపై కేసులు నమోదు కాకుండా పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. అదే పోలీసులకు భయపడి తలదాల్చుకోవాల్సిన పరిస్థితులను అయన ఎదుర్కొంటున్నాడు. వెంకట్రామిరెడ్డికి ఇంకా కొందరు పోలీసులు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు తలచుకుంటే వెంట్రామిరెడ్డిని పట్టుకోవడం పెద్దపని కాదన్న సర్వత్రా అభిప్రా యం వ్యక్తమవుతోంది. తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ పొందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోర్టు ఉత్తర్వులతో వారం వారం మాచర్ల పోలీసు స్టేషన్‌లో సంతకం చేస్తున్నారు. అయన మాచర్లలో నివాసం ఉండటం లేదు. హైదరాబాద్‌లో ఉంటున్నాడని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



గత ఎన్నికల అనంతరం దాడులకు తెగబడుతున్న దృశ్యం (ఫైల్)

హత్యాయత్నం కేసులు మూడు నమోదు

ఎన్నికల అరాచకాలకు సంబంధించి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై హత్యాయత్నం కేసులు మూడు నమోదయ్యాయి. కారంపూడి సీఐపై దాడి ఘటనలో వెంకట్రామిరెడ్డిపై సెక్షన్ 307 కింద కేసు నమోదైంది. మాచర్ల పట్టణంలో వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజున పట్టణంలో బీభత్సం సృష్టించారు. టీడీపీ నేతలను ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. కండ్లకుంటలో టీడీపీ ఏజెంట్‌గా పోలింగ్ కేంద్రంలో ఉన్న నోముల మాణిక్యరావుపై వెంకట్రామిరెడ్డి, వారి అనుచరులు దాడి చేశారు. ఈ మూడు సంఘటనలకు సంబంధించి వెంకట్రామిరెడ్డిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. పిన్నెల్లి సోదరుల ప్రధాన అనుచరుడు తురకా కిషోర్ కూడా వెంకట్రామిరెడ్డితో కలసి పరారయ్యాడు. అయన అచూకీని కూడా పోలీసులు కనుగొనలేకపోవడం గమనార్హం. పాల్వాయిగేటు పోలింగ్ బూత్, మాచర్ల పట్టణం, కారంపూడి ఘటనలలో తురగా కిషోర్‌పై కూడా మూడు హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. కాగా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాచర్ల వచ్చిన టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమపై కిషోర్ దాడికి పాల్పడి హత్యాయత్నంకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ఉన్నా పోలీసులు అతనిపై చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో బుద్దా వెంకన్న ఇటీవల నరసరావుపేటలో ఎస్పీ కార్యాలయంలో సదరు కేసును తిరిగి విచారణ జరపాలని తమపై దాడికి పాల్పడిన కిషోర్, అయనకు సహకరించిన పిన్నెల్లి సోదరులపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని కోరుతూ ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు సరైన రీతిలో స్పందించలేదని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తురగా కిషోర్‌ను అరెస్టు చేసి పోలీసు శాఖ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్న వాదన వినిపిస్తోంది.

సోలార్.. బేజార్!



- క్షేత్రస్థాయిలో విఫలమవుతున్న పీఎం సూర్యఘర్ పథకం
- సబ్సిడీలు రాక నానా అగచాట్లు పడుతున్న వినియోగదారులు
- కేంద్రం భారీ సబ్సిడీ ప్రకటించడంతో సామాన్యుల్లో ఆసక్తి
- అప్పు చేసి మరీ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్న వైనం
- సబ్సిడీ రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితి

- కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పీఎం సూర్యఘర్ స్కీము ద్వారా ఒకరు సోలార్ ప్లాంటు పెట్టించుకున్నారు. మూడు మెగావాట్ల ప్లాంటుకు రూ.78వేల సబ్సిడీ వస్తుండడంతో రూ.2లక్షలు బ్యాంకు లోను తీసుకుని మరీ ప్లాంటు పెట్టించుకున్నాడు. స్కీములో ప్రకారం ప్లాంటు పూర్తైన 30 రోజుల్లో సబ్సిడీ నగదు అకౌంట్లో జమవ్వాలి. కానీ సదరు వినియోగదారుడికి మూడు నెలలైనా సబ్సిడీ రాలేదు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. అనేకమంది సబ్సిడీ డబ్బులు రాక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

- సోలార్ ప్లాంటు పెట్టించుకున్న తరువాత గతం కంటే ఎక్కువ కరెంటు బిల్లు రావడంతో మరొకరు షాక్‌కు గురయ్యారు. సోలార్ ప్లాంటు పెట్టకముందు నెలసరి కరెంటు బిల్లు సగటున రూ.700 వచ్చేంది. రూ.2లక్షలు పెట్టి పీఎం సూర్యఘర్ కింద సోలార్ ప్లాంటు పెట్టుకున్నారు. ప్రతినెలా 400 యూనిట్లు కరెంటు తయారవడంతో 200 యూనిట్లు వాడుకుని, 200 యూనిట్లు డిస్కమ్‌కు ఎగుమతి చేస్తున్నారు. అయినా సరే కరెంటు బిల్లు మాత్రం కట్టాల్సివస్తోంది. ఒక నెల రూ.200 కరెంటు బిల్లు రాగా, రెండో నెల ఏకంగా రూ.731 బిల్లు వచ్చింది. దీంతో షాక్‌కు గురవడం వినియోగదారుడి వంతైంది.

గుంటూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఆచరణలో అప్రతిష్ఠ పాలవుతోంది. కేంద్రప్రభుత్వం భారీగా సబ్సిడీ ప్రకటించడంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు అనేకమంది సబ్సిడీ రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చెప్పిన మాట నమ్మి తాము మోసపోయామంటూ గగ్గోలు పెడుతున్నారు. దీనికితోడు మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు ప్రతినెలా కరెంటుబిల్లు కూడా చెల్లించాల్సి రావడంతో అగ్గిమీద గుగ్గిల మైపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం తమను ఘోరంగా వంచించిందని ఆగ్రహం చెందుతున్నారు.

● వేల సంఖ్యలో సోలార్ ప్లాంట్లు

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక కిలోవాట్ ప్లాంటుకు రూ. 30వేలు, రెండు కిలోవాట్లకైతే రూ.60వేలు, మూడు కిలోవాట్లకైతే రూ.78వేలు చొప్పన భారీ సబ్సిడీలు ప్రకటించింది. కోటి ఇళ్లపై ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని భారీగా ప్రచారం చేసింది. దీంతో చాలా మంది సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అందుతున్న లెక్కల ప్రకారం జూన్ ఐదో తేదీ నాటికి గుంటూరు జిల్లాలో 917 మంది, బాపట్ల జిల్లాలో 466 మంది, పల్నాడు జిల్లాలో 394మంది ఈ స్కీము కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. కాగా వీరిలో చాలా మందికి ఈరోజు వరకూ సబ్సిడీ మాత్రం దక్కలేదు.

● అప్పు చేసి తెచ్చుకున్న తిప్పలు

గత ప్రభుత్వం 8 సార్లు కరెంటు బిల్లులు పెంచి మోత మోగిస్తుండడంతో సోలార్ పెట్టుకుంటే కరెంటు బిల్లు చెల్లించే బాధ లేదన్న ఆశ, సబ్సిడీ భారీ మొత్తంలో వుండడంతో వేల సంఖ్యలో సామాన్యులు సోలార్ ప్లాంట్ల వైపు మొగ్గు చూపారు. కొద్దో గొప్ప అవకాశం వున్న ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్నారు. సగటున ఒక్కొకరు రూ. 2 లక్షలు ఖర్చు చేసి ప్లాంటు పెట్టుకున్నారు. బ్యాంకుల నుంచి రూ.లక్షా 80వేలు లోను తీసుకున్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే లక్ష రూపాయల లోనే కాబట్టి చెల్లించు కోవచ్చని భావించారు. కానీ వాస్తవ పరిస్థితి చాలా దారుణంగా వుంది. ప్లాంటు పూర్తై సబ్సిడీకి దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సబ్సిడీ ఇస్తానన్న కేంద్రం 100 రోజులు అవుతున్నా సబ్సిడీ ఇవ్వలేదు.

300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రమోట్ చేస్తోంది. కానీ వాస్తవంలో పరిస్థితులు వేరుగా వుంది. రూ. 2 లక్షలు పెట్టి ప్లాంటు పెట్టించుకున్నా కరెంటు బిల్లుల వాత మాత్రం వినియోగదారులకు తప్పడం లేదు. సోలార్ ప్లాంటు ద్వారా కరెంటు తయారు చేసుకుని, అదనపు కరెంటు డిస్కమ్‌కు ఎగుమతి చేసినా ప్రతి నెలా కరెంటు బిల్లు రావడంతో లబ్ధిదారులు షాక్‌కు గురవుతున్నారు. ప్రతి నెలా రూ. 200 నుంచి 300 వరకూ బిల్లులు వస్తున్నాయి. ఇంత ఖర్చు చేసినా గత వైసీపీ ప్రభుత్వం వేసిన అదనపు చార్జీల మోత మాత్రం తప్పలేదు. స్థిర చార్జీలు, కన్స్యూమర్ చార్జీలు, ట్రూఆప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రెండు, మూడు వందలు బిల్లులు వస్తుంటే వినియోగదారులు ఘొల్లుమంటున్నారు. చాలా చోట్ల అధికారుల నిర్వాకంతో గతంలో కంటే కరెంటు బిల్లులు అదనంగా రావడంతో హతాసులవుతున్నారు. దీనిపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక అల్లాడిపోతున్నారు.

గ్రామాల అభివృద్ధే పవన్ ధ్యేయం

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- వరద పీడిత గ్రామ సర్పంచ్‌లకు చెక్కుల పంపిణీ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9 : పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామం బాగుపడాలనే ఉద్దేశంతో గ్రామానికి రూ. లక్ష పవన్‌కల్యాణ్ అందజేస్తున్నారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జనసేన కార్యాలయంలో, జిల్లాలోని 15 వరద పీడిత గ్రామాల సర్పంచులకు రూ. లక్ష చొప్పన చెక్కులను జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ అధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో 100 చెరువులను గుర్తించామన్నారు. జీవం ఉండాలంటే జలం ఉండాలని, ఆ నీరును భూమిలో ఏవిధంగా పెంచుకోవాలో ప్రతి ఒక్కరు ఆలోచించాలన్నారు. . చెరువులు బాగు చేయడానికి ప్రజలు కూడా ఒక అడుగు ముందుకు వేయాలన్నారు. బొల్లాపల్లి రిజర్వాయర్ పూర్తిచేస్తే రాష్ట్రంలో రాయలసీమకు కూడా మంచి నీరు అందించవచ్చన్నారు. జలజీవన్ ద్వారా వచ్చే నిధులు కూడా అత్యవసరమైన పనులకు ఉపయోగించాలన్నారు. గ్రామాలకు విరాళం ఇచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. బాత్రుపాలెం, తంగెడ, పొందుగుల, రామాపురం, దైద, గొట్టిముక్కల, వేమవరం, తాడుట్ల, విజయపురి సౌత్, పసువేముల, గోలి, మల్లవరం, దామారపాడు, గోరంట్ల, రెంటపాళ్ళ గ్రామాల సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, వీరవల్లి వంశీ, అచ్చుల సాంబశివరావు,మద్దిరాల గంగాధర్, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

వినుకొండ పట్టణంలో సోమవారం జరిగిన ఆర్మీ సైకిల్ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



7లో..

వినాయకుని లడ్డూ రూ.7.10 లక్షలు

రెంటచింతల, సెప్టెంబరు 9: మండల కేంద్రమైన రెంటచింతలలోని శ్రీసాయి గణేష్ యూత్ (ఆనందపేట) వినాయకుని ప్రసాదం లడ్డూను సోమవారం రాత్రి ప్రధాన రహదారిలో నిర్వహించారు. ఓ వైపు డీజే సౌండ్స్, మరోవైపు భారీ ఎత్తున బాణాసంచా మోతలు, ఎవరూ ఊహించని రీతిలో విద్యావంతులైన మహిళలు నృత్యం చేయడం వందలాది మందిని ఆకర్షించింది. మూడేళ్ల తరువాత లడ్డూ వేలం పాటను నిర్వహిస్తున్నారనే సమాచారంతో పరిసర గ్రామాల నుంచి రెంటచింతల పుర ప్రముఖులు భారీ ఎత్తున హాజరయ్యారు. రూ.7.10 లక్షలకు టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి దక్కించుకున్నారు. 80 కేజీల లడ్డుతో పాటు రూ.2.50 లక్షలు విలువచేసే 30 గ్రాముల బంగారం అందులో ఉంచారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇంత ధర పలకడం పల్నాడు జిల్లాలో ఇదే ప్రథమం. కాగా 2019లో ఈ వినాయకునికి సంబంధించి నిర్వహించిన వేలంపాటలో రూ. 5.10 లక్షలు ధర పలికింది.



లడ్డూను కైవసం చేసుకున్న ఆదిరెడ్డి

మైనర్‌పై లైంగిక దాడి : పాస్టర్‌కు శిక్ష

● 20 ఏళ్లు జైలు, రూ. లక్ష జరిమానా

గుంటూరు(లీగల్), సెప్టెంబరు 9: ప్రార్థనకు వచ్చిన 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమెను గర్భవతిని చేసినట్టు నేరం రుజువు కావడంతో వెంకటపాలెంలోని ఎస్సీ కాలనీలో పాస్టర్‌గా పనిచేస్తున్న నీలం కోటేశ్వరరావుకు 20 సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు ఇన్చార్జి న్యాయమూర్తి కె.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిందితుడు కోటేశ్వరరావు చుట్టుపక్కల గ్రామాల్లో పచ్చళ్లు, కొబ్బరినూనె అమ్ముతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాస్టర్‌గా కూడా పని చేసేవాడు. తాను కొత్తగా నిర్మించుకున్న భవనంలో ప్రార్థనలు నిర్వహిస్తూ ఉండేవాడు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆ ప్రార్థనలకు వస్తూ ఉండేవారు. ఆ కాలనీలోనే ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక కూడా శని, ఆదివారాల్లో రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య ప్రార్థనలకు వచ్చి పాటలు పాడుతూ ఉండేది. నిందితుడు కోటేశ్వరరావును తాతయ్య అని పిలుస్తూ ఉండేది. ఈ క్రమంలో 2017 నవంబర్ 18న ప్రార్థనలు పూర్తికాగానే అందరూ వెళ్లిపోయారు. ఆ బాలిక మైక్ సెట్‌లతో పాటు కింద పరిచి ఉన్న దుప్పట్లను మడతపెట్టి సర్దుతూ ఒక్కటే ఉంది. నిందితుడు కోటేశ్వరరావు దీనిని ఆసరాగా తీసుకొని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయంతో ఆమె ఈ ఘటనను తల్లిదండ్రులకు చెప్పలేదు. ప్రార్థనలకు వెళ్లడం మానేసింది. అయితే ప్రార్థనలకు వెళ్లమని తల్లి పదేపదే చెబుతుండటంతో మరో 10 రోజుల తర్వాత ఓసారి ప్రార్థనకు వెళ్లగా అప్పుడు కూడా కోటేశ్వరరావు ఆమెపై మరోసారి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని ఇంటికి చేరింది. నెలసరి రాకపోయినా రక్తహీనత వల్ల నెలసరి సక్రమంగా రాలేదని ఆమె తల్లి భావించింది. కొన్నాళ్లకు ఆ బాలిక తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతుండటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె నాలుగో నెల గర్భవతి అని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు నిలదీయగా ఆమె తనపై నిందితుడు చేసిన అఘాయిత్యాన్ని చెప్పింది. డాక్టర్లు ఇచ్చిన సమాచారం మేరకు తుళ్లూరు పోలీసులు విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆ బాలిక వద్ద స్టేట్మెంట్ నమోదు చేసి నిందితుడు కోటేశ్వరరావుపై అత్యాచార నేరంపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎన్ఏ టెస్ట్‌లోనూ ఆ బాలిక గర్భవతి కావటానికి కోటేశ్వరరావు కారణం అని తేలింది. అప్పటి తుళ్లూరు సీఐ సీహెచ్ రవిబాబు ఈ కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏపీపీ కె.శ్యామల కోర్టులో ప్రాసిక్యూషన్ నిర్వహించారు. విచారణ అనంతరం నిందితుడు కోటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

విజ్ఞాన్‌లో చదువుతోపాటు నైపుణ్యాలు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 9: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీని సోమవారం జింబాబ్వే ప్రభుత్వ ప్రతినిధులు అలాగే న్యూఢిల్లీ నుంచి ఎంబసీ ప్రతినిధులు సందర్శించారని వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండియాలోని జింబాబ్వే ప్రతినిధి మాట్లాడుతూ గతేడాది 45 మంది విద్యార్థులను జింబాబ్వే ప్రభుత్వం విజ్ఞాన్ యూనివర్సిటీలో వేర్వేరు ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి పంపించామన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా 107 మంది విద్యార్థులను వేర్వేరు కోర్సుల కోసం ఇక్కడికి పంపించినట్లు తెలిపారు. ముఖ్యంగా అగ్రికల్చర్ బీఎస్సీకి ప్రాధాన్యతనిస్తూ జింబాబ్వే ప్రభుత్వం ఎక్కువ మంది విద్యార్థులను ఈ కోర్సుకి ఎంపిక చేసినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులను పంపించడానికి గల కారణాలు వివరిస్తూ విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ పి.నాగభూషణం, రిజిస్టర్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, సీఈవో నందిగామ శ్రీకాంత్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వర్సిటీలో జింబాబ్వే ప్రతినిధులు

ట్రాఫిక్, మెకానిక్ స్పేర్ రైలు బోగీల కొరత



● ఏదైనా బోగీ పీవోహెచ్‌కు వెళ్తే ప్రయాణికులకు ఇబ్బందులే
● పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ప్రస్తుతం సీ1 బోగీ కష్టాలు

గుంటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్, మెకానిక్ స్పేర్ రైలు బోగీల కొరత గుంటూరు రైల్వే డివిజన్‌ని పట్టి పీడిస్తుంది. ముఖ్యంగా ఏసీ ఛైర్‌కార్, త్రీటైర్, టూటైర్ బోగీల స్పేర్స్ ఒక్కటి కూడా డివిజన్ వద్ద అందుబాటులో లేవు. దీంతో ఏదైనా రైలుకు సంబంధించిన బోగి పీరియాడికల్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్)కు వెళ్తే ఇక అది తిరిగొచ్చేవరకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏసీ బోగీలో వెళదామని అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకొన్న ప్రయాణికులకు రైల్వే అధికారులు ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్‌లో సీట్లు కేటాయిస్తున్నారు. కొంతమంది గత్యంతరం లేని పరిస్థితుల్లో రైల్వే చూపించిన ప్రత్యామ్నాయ బోగీలో ప్రయాణిస్తుండగా చాలామంది రద్దు చేసుకొంటున్నారు.

ఏసీ ఛైర్‌కార్ కష్టాలు

రైలు బోగీల మెయిన్‌టెనెన్స్ కోసం విడతల వారీగా రేణిగుంటలో ఉన్న ఓవర్ హాలింగ్ డిపోకి పంపుతారు. ఒకసారి పీవోహెచ్ జరిగిన తర్వాత మళ్లీ ఎప్పుడు చేస్తారనేది కూడా ముందుగానే తేదీని నిర్ణయిస్తారు. ఆ ప్రకారం రైల్వే శాఖ ప్రత్యామ్నాయం చూసుకోవాలి. అయితే డివిజన్ వద్ద ఎలాంటి స్పేర్ ఏసీ బోగీలు లేకపోవడంతో గత కొన్ని రోజుల నుంచి పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు ఏసీ ఛైర్‌కార్ కష్టాలు వెంటాడుతోన్నాయి. పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు రేక్ రేషింగ్‌తో కూడుకొని ఉంటాయి. ఒక రోజు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా నడిపితే దానినే తర్వాత రోజు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌గా మార్పు చేసి నడుపుతారు. ఈ రెండు రైళ్లకు ఒక ఏసీ ఛైర్‌కార్ బోగీ ఉంది. అది వారం క్రితం పీరియాడికల్ ఓవర్ హాలింగ్ నిమిత్తం రేణిగుంట షెడ్డుకు వెళ్లింది. అక్కడి నుంచి ఎప్పటికి తిరిగొస్తుందో తెలియని పరిస్థితి.

స్పేర్ మంజూరు చేయాలి

రైల్వేలో సాధారణంగా ఇలా పీవోహెచ్‌కు ఏదైనా బోగీని పంపితే దానికి ప్రత్యామ్నాయంగా వేరొకటి ఏర్పాటు చేస్తారు. దీనినే మెకానికల్ స్పేర్ అంటారు. కొన్ని సందర్భాల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే అదనంగా మరో బోగీ ఏర్పాటు చేస్తారు. దానిని ట్రాఫిక్ స్పేర్‌గా పరిగణిస్తారు. ఈ రెండు స్పేర్‌లు ప్రస్తుతం డివిజన్ వద్ద అందుబాటులో లేవు. పీవోహెచ్‌కు పంపిన ఏసీ ఛైర్‌కార్ బదులు ఏసీ త్రీటైర్ అయినా ఏర్పాటు చేయాలి. ఒకవేళ ఏమైనా ఛార్జీలో వ్యత్యాసం ఉంటే దానిని ప్రయాణికుల వద్ద వసూలు చేయవచ్చు. కాగా ప్రస్తుతం పల్నాడు, సింహాద్రి రైళ్లకు రెండు రోజులకు ఒకసారి ఏసీ ఛైర్‌కార్ లేదని, దానికి ప్రత్యామ్నాయంగా సెకండ్ సిట్టింగ్ డీఈ1 బోగీ ఏర్పాటు చేశామని ప్రయాణికుల ఫోన్లకు సందేశాలు వస్తున్నాయి. ఏసీ ఛైర్‌కార్ కంటే సెకండ్ సిట్టింగ్ ఛార్జీ తక్కువ కావడంతో ఆ మొత్తాన్ని రీఫండ్ కోరవచ్చని సలహా ఇస్తున్నారు. ఇది తతంగంతో కూడుకున్నది. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు, ఎంపీలు సమస్యని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లి డివిజన్‌కి కనీసం ఒక ఏసీ ఛైర్‌కార్, మరో ఏసీ త్రీటైర్, టూటైర్ బోగీలను స్పేర్‌గా మంజూరు చేయించాల్సిన అవసరం ఉన్నది.

నిశ్చింతగా ఉన్నామంటే సైనికుల త్యాగాల ఫలితమే



ఆర్మీ సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు
● టెరిటోరియల్ ఆర్మీ సేవలకు 75 వసంతాలు పూర్తి
● వినుకొండ పట్టణంలో జవాన్ల సైకిల్ యాత్ర

వినుకొండ, సెప్టెంబరు 9: సరిహద్దుల్లో లక్షల మంది సైనికుల త్యాగాల ఫలితంగానే దేశంలో ప్రజలంతా గుండెలపై చెయ్యి వేసుకుని నిశ్చింతగా ఉండగలుగుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అందుకే జైజవాన్ అంటూ నినదీస్తూ వారికి అత్యున్నత గౌరవం ఇస్తున్న దేశం కూడా మనదే అంటూ సైన్యం సేవలను ఆయన ఘనంగా కొనియాడారు. దేశంలో టెరిటోరియల్ ఆర్మీ సేవలకు 75 వసంతాలైన సందర్భంగా 30 మంది జవాన్లతో కశ్మీర్ సియాచిన్‌లోని గ్లేసియర్ బేస్ క్యాంప్ నుంచి మొదలై అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర ఆదివారం వినుకొండకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో వినుకొండలో జవాన్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కారంపూడి రోడ్డులోని ఎస్ఎస్‌సీ కాలవ వద్ద జవాన్ల సైకిల్ యాత్రను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సోమవారం జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈయాత్రలో పాల్గొన్న జవాన్లు ఎమ్మెల్యే ఆంజనేయులు దంపతులను అభినందించారు. బస్టాండ్ సెంటర్ నుంచి స్తూపం మీదుగా లయోల పాఠశాల వరకు ర్యాలీ సాగింది. జవాన్లతోపాటు సైకిల్ తొక్కిన జీవీ వారిని ఉత్సాహ పర్చారు. పట్టణంలో సాగిన యాత్రలో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత, పట్టణ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. యాత్రలో భాగంగా బృంద సభ్యులు లయోల పాఠశాల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. యాత్ర మార్గమధ్యలో వివిధ ప్రాంతాల్లో సుమారు 40 వేల మందికిపైగా మాజీ సైనిక ఉద్యోగులు, వీరసైనికుల సతీమణిలతోపాటు వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 75వ వజ్రోత్సవానికి చేరువైన టెరిటోరియల్ సైన్యానికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నట్లు తెలిపారు. శత్రుదేశాలు, ఉగ్రవాదుల నుంచి దేశాన్ని కాపాడుతున్న సైనిక సేవలను మరిచిపోలేమన్నారు. 1949లో ప్రారంభమై నేటి వరకు ప్రతి ఆపద కాలంలో దేశానికి టెరిటోరియల్ ఆర్గనైజింగ్ సేవలు వెలకట్టలేనివని తెలిపారు. మక్కెన మాట్లాడుతూ ఆర్మీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ యాత్ర వినుకొండకు రావడం సంతోషం అన్నారు. ఆంజనేయులు చేతుల మీదుగా యాత్రను చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు మాజ్‌రావత్, అభిత్ తోపాటు 46 మంది జవాన్లు, ఎంఈవో జఫ్రుల్లాఖాన్, జనసేన నాయకులు నాగశ్రీను, మాజీ ఆర్మీ జవాన్ బొల్లాపల్లి వెంకట్రావు, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ లక్షణ్ కిషోర్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, పటాన్ ఆయుబ్ ఖాన్, లగడపాటి వెంకట్రావు, పెమ్మసాని నాగేశ్వరరావు, వాసిరెడ్డి లింగమూర్తి, రోడ్డా వీరాంజనేయరెడ్డి, సౌదాగర్ జానీ బాషా, మస్తాన్‌రావు, యర్రమాస్ కోటేశ్వరరావు, ప్రైవేట్ విద్యాసంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రలోభ పెట్టారు.. భయ పెట్టారు

● ఇన్చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన జబీన్

దుగ్గిరాల, సెప్టెంబరు 9: 'తెదేపా ఎంపీటీసీ సభ్యులను భయపెట్టారు.. కేసులు పెట్టారు.. ప్రలోభ పెట్టారు.. నాకు బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా వేధించారు.. అధైర్యపడకుండా ధర్మం గెలుస్తుందన్న నమ్మకంతో ఉన్నాను' అని ఇన్చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన షేక్ జబీన్ తెలిపారు. దుగ్గిరాల మండల ఇన్చార్జి ఎంపీపీగా చిలువూరు ఎంపీటీసీ మెంబర్ షేక్ జబీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు తెదేపా, జనసేన నాయకులు జబీన్‌ను సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించారు. రెండున్నరేళ్ల క్రితం జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మెజార్టీ సభ్యులు తొమ్మిది మందితో ఎంపీపీ పీఠం తెదేపా దక్కించుకోవాల్సి ఉంది. రాజకీయ కారణాల నేపథ్యంలో అధికారులు పోటీలో ఉన్న ఎంపీపీ అభ్యర్థికి బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా, వైసీపీ సభ్యురాలికి ఎంపీపీ కట్టబెట్టిన విషయం విదితమే. కాగా ఇటీవల ఎంపీపీ రాజీనామా చేయడంతో ఇన్చార్జి ఎంపీపీగా జబీన్‌ను ప్రకటిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. బాధ్యతల స్వీకరణ అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీటీసీ మెంబర్ తాళ్ల అశోక్ అధ్యక్షత జరిగిన అభినందన కార్యక్రమంలో జబీన్ మాట్లాడుతూ బీసీ సర్టిఫికెట్ ఇవ్వకుండా తనను వేధించారని, తహసీల్దార్, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేశామని, హైకోర్టు తీర్పును కూడా గౌరవించకుండా తనకు ఎంపీపీ పీఠం దక్కకుండా చేశారన్నారు. తాను అధైర్యపడకుండా అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్, పోతినేని శ్రీనివాస్, శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. ఎంపీపీ ఎన్నికల సమయంలో వైసీపీ చేసిన మోసాలను గుర్తు చేశారు. చిలువూరు-2 ఎంపీటీసీ మెంబర్ రోజమరియమ్మ మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా అందరం ఒకేమాటకు కట్టుబడి ఐక్యంగా నిలిచామన్నారు. ఈమని ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య మాట్లాడుతూ తన భర్త శ్రీనివాసరావుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి, ఇంటికి పోలీసులను పంపి వేధింపులకు గురిచేయడంతో రెండు నెలలు అజ్ఞాతంలో గడపాల్సి వచ్చిందన్నారు. పేరుకలపూడి ఎంపీటీసీ మెంబర్ తాళ్ల అశోక్ మాట్లాడుతూ ఎంపీటీసీగా గెలిచిన నాటి నుంచి పలురకాలుగా వేధిస్తూ వచ్చారని, పార్టీలో చేరకుంటే చంపుతామని కూడా బెదిరించారన్నారు. ఎంపీటీసీ సభ్యులు పుతుంబాక సాయికృష్ణ, విశ్వనాథపల్లి శివకుమార్, మరీదు రాము, కొప్పుల మధుబాబు, గ్యారా నిర్మల, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, గూడూరు వెంకట్రావు, జలాలుద్దీన్, నిజాముద్దీన్, సాదిక్, కో-ఆప్షన్‌సభ్యుడు వహీదుల్లా, తోటకూర సీతారామయ్య, యడ్ల సాయికృష్ణ, నర్రా శ్రీనివాసరావు, యడ్ల రామారావు, పాటిబండ్ల కృష్ణప్రసాద్, తాడిబోయిన రామకృష్ణ, నందిపాటి జోగారావు, కొరిటాల సురేష్, యేమినేని కోటేశ్వరరావు, పలువురు జబీన్‌ను అభినందించారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న షేక్ జబీన్

వరద బాధితులను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రసంగిస్తున్న నీటిపారుదల రంగ నిపుణులు లక్ష్మీనారాయణ

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 9 : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వమే పూర్తిస్థాయిలో వరద బాధితులను ఆదుకోవాలని నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ అన్నారు. జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులో బుడమేరు నేర్పిన గుణపాఠాలపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ, బుడమేరు వరదలు ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అపార నష్టం కలిగించాయని అన్నారు. ఇలాంటి ఉపద్రవం భవిష్యత్తులో జరగకుండా బుడమేరు సహజ ప్రవాహ మార్గాన్ని కొల్లేరు సరస్సు వరకు సుగమం చెయ్యాలని అన్నారు. ఆక్రమణలను, కబ్జాలను తొలగించాలని, బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా కృష్ణానదికి 37,500 క్యూసెక్కుల ప్రతిపాదిత సామర్థ్యాన్ని యుద్ధ ప్రతిపాదికన అమలులోకి తీసుకుని రావాలని కోరారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వం అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, సినీ, వ్యాపార రంగ ప్రముఖులు ప్రదర్శిస్తున్న దాతృత్వాన్ని, మానవత్వాన్ని మరువలేమన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంతం 45శాతం ఉండగా, బుడమేరు పరివాహక ప్రాంతం 48 శాతంగా ఉందన్నారు. ఇలాంటి బుడమేరును విస్మరించారన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద 11 లాకులు ఉంటే నాలుగు పనిచేయడం లేదని సరైన సిబ్బంది లేరని తెలిపారు. పులిచింతల దిగువ భాగంలో వైకుంఠపురం వద్ద 20 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తే మున్నేరు వరద నీటిని నిల్వ చేసుకోగలమన్నారు. వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి నాగార్జునసాగర్ కుడి కాలువకు నీరు తరలిస్తే గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానానికి తోడ్పడుతుందన్నారు. శ్రీశైలంపై భాగాన కృష్ణా నదిపై సిద్దేశ్వరం ఆనకట్టను, కృష్ణా నదిలో కలిసే తుంగభద్రపై సుంకేసుల ఆనకట్టకు పై భాగాన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మిస్తే కరువు పీడిత ప్రాంతాలైన రాయలసీమకు నీరు అందించగలమన్నారు. ఈ చర్చా గోష్ఠిలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, రాజకీయ విశ్లేషకులు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

స్టాక్ మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలి

పెదకాకాని, సెప్టెంబరు 9: మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పుల్లో భాగంగా మేనేజ్మెంట్, ఎంబీఏ, కామర్స్ విద్యార్థులు స్టాక్ మార్కెట్, సెక్యూరిటీ మార్కెట్, కమోడిటీ మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలని విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ వ్యాపార అధ్యయన విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ ప్రత్యామ్నాయ పెట్టుబడులు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఛాన్సలర్ గంగాధర్ రావు మాట్లాడారు. విభాగాధిపతి ఆచార్య వి.చంద్రశేఖరరావు మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్, విప్పతి క్యాపిటల్ కంపెనీ సంయుక్తంగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు సెబి సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, ట్రైనర్ జి.రాజశేఖర్ రెడ్డి నిర్వహిస్తారని పేర్కొన్నారు.

బుద్ధిజం విద్యార్థికి నివాళి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిజం స్టడీస్ విభాగంలో ఎంఏ మొదటి సెమిస్టర్ అభ్యసిస్తున్న మయన్మార్ దేశానికి చెందిన విద్యార్థి కొండన్న మృతికి యూనివర్సిటీ సంతాపం తెలిపింది.

8 మండలాల్లో తీవ్రంగా వరద

● ముమ్మరంగా సహాయక చర్యలు
● సబ్ కలెక్టర్ సంజన సిన్హా



తెనాలి అర్బన్, సెప్టెంబరు 9: తెనాలి డివిజన్‌లోని 8 మండలాల్లో వరద తీవ్రంగా ఉందనీ, ప్రకృతి విధ్వంసాన్ని ఎదుర్కొనేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకున్నామని సబ్ కలెక్టర్ సంజన సిన్హా చెప్పారు. సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గత 9 రోజులుగా ఈ మండలాల్లో వరద ప్రభావం ఉందన్నారు. 2022 ఐఏఎస్ అభ్యర్థిగా శిక్షణ అనంతరం విధుల్లో చేరిన వెంటనే వరదల అనుభవం ఎదురైందన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో సర్వే చేసి నష్టపోయిన వారికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కూడా వరద కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన తనకు రెండు రాష్ట్రాలలో పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పారు. స్థానిక భాషలో ప్రజలతో మాట్లాడగలిగే సామర్థ్యం ఉందని, వారి సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వరద బాధితులకు రూ. 5 లక్షలు విరాళం



సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్, శ్రీనివాసరావు, సాంబిరెడ్డి

తాడికొండ, సెప్టెంబరు 9: వరద బాధితులకు అండగా ఉండేందుకు బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ కంపెనీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు రూ. 5 లక్షల చెక్కును కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌బీవీఆర్ ప్రసాద్, రీజినల్ మేనేజర్స్ వడ్లమూడి శ్రీనివాసరావు, సాంబిరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా విజయవాడలోని పలు ప్రాంతాలు నీటమునిగి అపార ఆస్తి, ప్రాణనష్టం జరిగిందన్నారు. వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు కంపెనీ రూ. 5 లక్షలు విరాళం ప్రకటించిందని తెలిపారు.

రేపు గుంటూరుకు మాజీ సీఎం జగన్

● సబ్ జైలులోనున్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు పరామర్శ

గుంటూరు, సెప్టెంబరు 9: గుంటూరుకు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం రానున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయి గుంటూరులోని సబ్‌జైలులో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ వస్తున్నారు. ఈ మేరకు జగన్ పర్యటనను ఖరారు చేస్తూ ఆ పార్టీ నేతలకు సోమవారం సమాచారం అందించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసి గుంటూరులోని సబ్‌జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కాగా, ఇదే కేసులో ఉన్న పలువురు వైసీపీ నేతలను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

సంగం పశుదాణా పంపిణీ



సంగం దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు 9: వరద బారిన పడిన రైతులను ఆదుకోవటానికి సంగం డెయిరీ ముందుకు రావటం హర్షణీయమని వేమూరి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. సంగం డెయిరీ వరద ముంపు గ్రామాల్లోని పాల రైతులకు ఆపన్న హస్తం అందజేసింది. పలు గ్రామాల్లో రైతులకు రూ.13.35 లక్షల విలువ కలిగిన పశు దాణాను ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు సంగం అధికారులు పంపిణీ చేశారు. జువ్వలపాలెంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఓలేరు బీఎంసీ పరిధిలో భట్టిప్రోలు మండలంలోని 11 గ్రామాల్లో 436 మంది పాడి రైతులకు, రేపల్లె మండలంలో రెండు గ్రామాల్లో 150 మంది పాడి రైతులకు, కొల్లూరు మండలంలోని 4 గ్రామాలకు 213 మంది రైతులకు, చల్లపల్లి మండలంలో 39 రైతులకు, జంపని బీఎంసీ పరిధిలో కొల్లూరు మండలంలో 10 గ్రామాల్లో 371 మంది పాడి రైతులకు, కొల్లిపర మండలంలోని పాతబొమ్మువారిపాలెం గ్రామంలో 29 మంది రైతులకు, ఉంగుటూరు బీఎంసీ పరిధిలో తుళ్లూరు మండలంలోని హరిశ్చంద్రపురం గ్రామంలో 42 మంది పాడి రైతులకు, అమరావతి మండలంలోని వైకుంఠపురం పెద్ద మొద్దూరు, చావపాడు గ్రామాల్లో 225 మంది పాడి రైతులకు మొత్తం 58 టన్నుల పశు దాణాను పాలకవర్గ సభ్యులు, అధికారులు పంపిణీ చేశారు. పాలకవర్గ సభ్యులు నర్ర వెంకట కృష్ణ ప్రసాద్, జ్ఞానానంద భగవాన్, వలివేటి ధర్మారావు, కంచర్ల శివరామయ్య, జీఎం కొల్లి వెంకటేశ్వర ప్రసాద్, మేనేజర్లు పాతూరి ఆదినారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ నిధులు ఇవ్వటం హర్షణీయం



సర్పంచులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 9: రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇబ్బంది పడిన నాలుగు వందల పంచాయతీలు ఉండగా పెదకూరపాడు నియోజకవర్గంలోని 40 గ్రామ పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిధులు ఇవ్వటం హర్షణీయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అమరావతిలో సోమవారం వరద ప్రభావిత పంచాయతీలకు పవన్ కల్యాణ్ రూ.40 లక్షల ఆర్థిక సాయం చెక్కులతో పాటు మరో పది గ్రామాలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మరో రూ.10 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. పవన్ కల్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గంలో నా వంతుగా దెబ్బతిన్న పది గ్రామాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నానన్నారు. ప్రజలు తమ చేతనైన సహాయం చేయాలని, సొంత నిధులతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందనీ, సర్పంచులను జీరోలు చేస్తే కూటమి ప్రభుత్వం వారిని హీరోలను చేసిందని, గత ప్రభుత్వంలో పంచాయతీల్లో జరిగిన అవినీతిని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సాయం ఆలస్యమవుతుందనే ఉద్దేశంతోనే పంచాయతీల పారిశుధ్య పనులకు పవన్ కల్యాణ్ సొంత నిధులు కేటాయించారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు వెయ్యి కోట్లు విడుదల చేసిన వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్, నేషనల్ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాష్టి వీరాంజనేయులు, పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు యర్రంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

నియంత దుశ్చర్యకు ఏడాది..

- నాడు చంద్రబాబు అక్రమ అరెస్టుపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పిన ప్రజలు
- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


చంద్రబాబుతో జూలకంటి (ఫైల్)

మాచర్లటౌన్, సెప్టెంబరు 9: 'నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిస్వార్థ ప్రజాసేవకై అంకితమైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టు ఘటనకు ఏడాది పూర్తయింది. అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన నియంతృత్వ దుశ్చర్య కారణంగా చంద్రబాబు జైలు పాలయ్యారు' అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆనాటి జగన్ వికృత చేష్టలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరని, ఆ సంఘటనతో నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ టీడీపీ గెలుపు తమ గెలుపుగా భావించి అహర్నిశలు శ్రమించి కూటమికి భారీ విజయాన్ని అందించారన్నారు. రాష్ట్రంలో వైసీపీని ప్రతిపక్ష పార్టీకి సైతం పనికిరాని విధంగా తీర్పునిచ్చి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజలకు నిస్వార్థపూరితంగా సేవ చేయడమే ధ్యేయంగా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర పునర్‌నిర్మాణం కోసం అహర్నిశలూ పాటుపడుతున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కొనియాడారు.

కత్తితో బెదిరించి బంగారం అపహరణ

బెల్లంకొండ, సెప్టెంబరు 9: గుర్తుతెలియని దుండగులు ఓ వృద్ధ దంపతుల ఇంట్లోకి చొరబడి, కత్తితో బెదిరించి వృద్ధురాలి మెడలోని బంగారు గోలుసును అపహరించిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బెల్లంకొండ ఎస్ఐ రాజ తెలిపిన వివరాల ప్రకారం.. బండారు అనసూయమ్మ, గోవిందులు అనే వృద్ధ దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి, ఇంట్లోకి చొరబడి కత్తి చూపించి అనసూయమ్మ మెడలో ఉన్న 26 గ్రాముల బంగారు గొలుసుని లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఆసమయంలో గోవిందు అడ్డుపడగా దుండగుడు కత్తితో అతని రెండు చేతులకు గాయాలు చేసి బంగారు గొలుసుని లాక్కొని పరారయ్యారు. ఇంతలో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం గోవిందును సత్తెనపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సురేష్ బాబు, స్క్వాడ్ సీఐ బాలాజీ, స్థానిక ఎస్ఐ రాజా సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. సమీపంలో ఉన్న సీసీ కెమేరాలను ఎస్ఐ రాజా పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పల్నాడు విద్యార్థులు

దుర్గి, సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9: పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్నవరంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు దుర్గి జడ్పీ హైస్కూలు విద్యార్థి షేక్ బాషా, సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ళ హైస్కూలు విద్యార్థులు టీ.కుసేంద్ర, ఎస్‌కే బాల సైదాలు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరమ్మ, కుమారశాస్త్రిలు సోమవారం వేర్వేరుప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయాపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది, గ్రామస్థులు పలువురు అభినందించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మాచర్లటౌన్, సెప్టెంబరు 9: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని నెహ్రూనగర్ రెండో లైన్‌కు చెందిన రాసంశెట్టి లక్ష్మి(38) నివాసముంటున్నారు. భర్త రామకృష్ణ కారు డ్రైవర్. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆదివారం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ విషయంపై రామకృష్ణ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ప్రభాకరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా లక్ష్మి మృతదేహం సోమవారం దుర్గి సమీపంలోని బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి కుమారుడు మధుసాయి, కుమార్తె కామాక్షి ఉన్నారు.

ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 9: పట్టణంలో ఒడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావును సోమవారం వడ్డెర సంఘీయులు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాయలంలో చైర్మన్ నరసింహారావును కలిసి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒడ్డే ఓబన్న విగ్రహ కమిటీ చైర్మన్ కొమెర అనంతరాములు, గౌరవాధ్యక్షుడు కొమెర దుర్గారావు, ఓర్సు శంకరరావు, చంద్రశేఖరరావు, చల్లా పిచ్చయ్య, బత్తుల మల్లికార్జునరావు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, పిచ్చయ్య మాష్టారు, దేవళ్ల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మాగులూరి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9 : మాతా శిశు సంరక్షణకు మాగులూరి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని ఫణిదం పీహెచ్‌సీలోని గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని కన్నా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుప్రకాష్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, దరువూరి నాగేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

- పోలీసు స్టేషన్ వద్ద వడ్డెర సంఘీయుల ఆందోళన

మాచర్లటౌన్, సెప్టెంబరు 9: ఓ యువకుడిపై దాడి ఘటనలో సోమవారం పట్టణ పోలీసు స్టేషనులో కేసు నమోదైంది. పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఉప్పుతోళ్ల వెంకటేష్ ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలోని ఓ దుకాణం వద్ద కూల్‌డ్రింక్ తాగుతుండగా కొందమంది యువకులు వచ్చి దుర్భాషలాడుతూ తనపై దాడిచేసినట్లు వెంకటేశ్వర్లు అనే యువకుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శేషయ్య, అంజి, నరేష్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు. దాడికి పాల్పడిన వారి కోసం గాలింపు చేపట్టామన్నారు.

ఈ ఘటనపై వడ్డెర సంఘీయులు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గీయులే లక్ష్యంగా దాడులు చేస్తూ వైసీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయతీలకు జనసేనాని నిధులు

- వరద ప్రభావిత గ్రామాలకు రూ.లక్ష చెక్కులు పంపిణీ
- మంత్రి మనోహర్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన నేతలు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన 400 పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనసొంత నిధులనుంచి రూ.4కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. పల్నాడు జిల్లాలో వరద వర్షం, వరద ప్రభావిత ప్రాతాల్లో నష్టపోయిన ఆయా పంచాయతీలకు సోమవారం నరసరావు పేట కేంద్రంగా సోమవారం పంచాయతీలకు పంపిణీ చేశారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు జనసేన నేతలు నగదు చెక్కులు అందు కున్నారు.

మాచర్ల మండలంలోని విజయపురిసౌత్, ఏకోనాంపేట గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి రూ.లక్ష చెక్కు మంజూరుకాగా జనసేన విజయపురిసౌత్ అధ్యక్షుడు రాహుల్, ఉపాధ్యక్షుడు చరణ్, కార్యదర్శి పండులు చెక్కులను అందుకున్నారు.

మాచవరం : మాచవరం మండలంలోని వేమవరం, తాడుట్ల గ్రామ పంచాయతీలకు రూ. లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. నరసరావుపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీలు వేమవరం, తాడుట్ల గ్రామాలకు లక్ష రూపాయల చొప్పున చెక్కులు అందజేశారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు ఈ నగదును వెచ్చించాలని సూచించారు. నగదును పారదర్శకంగా వినియోగించి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొండేటి కృష్ణారెడ్డి, మాచవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ అంకారావు, జిల్లా జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులు అంబటి మల్లి, పంచాయతీ కార్యదర్శులు సురేఖ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గురజాలటౌన్: మండలంలోని దైద, గొట్టిముక్కల గ్రామాలు వరద ముంపు గ్రామాల జాబితాలో ఉండడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నరసరావుపేట పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా గ్రామానికి రూ. లక్ష చొప్పున చెక్కులను అందుకున్నారు. చెక్కులను అందుకున్న వారిలో దైద సర్పంచ్ లావూరి లక్ష్మీబాయి, సెక్రటరీ లక్ష్మి, గొట్టిముక్కల సర్పంచ్ నాగరాజు, సెక్రటరీ విజయ్‌లు ఉన్నారు.


వేమవరం పంచాయతీకి చెక్కు అందజేస్తున్న ఎంపీ లావు తదితరులు


చెక్కులను అందుకుంటున్న గురజాల మండల గ్రామాల సర్పంచ్‌లు

వీధి పేర్లతో బోర్డులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 9 : సత్తెనపల్లి పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మునిసిపల్ అధికారులు సోమవారం వీధి పేర్లతో బోర్డులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పట్టణాభివృద్ధిపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. పట్టణంలో అన్ని ప్రాతాలు అందరికి తెలిసేలా, ఎక్కడ ఏ వీధి అని కన్పించేలా బోర్డులు ఏర్పాటు చేయటం మంచి విషయమని స్థానికులు కొనియాడుతున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

బెల్లంకొండ, సెప్టెంబరు 9 : బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీల ఆధ్వర్యంలో బెల్లంకొండ ప్రధాన మార్గంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారికి ఇరువైపులా మురుగు నీరు చేరి రహదారి మీదికి చేరడంతో స్థానికులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. గమనించిన సర్పంచ్ పారిశుధ్య కార్మికులతో రహదారికి ఇరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించి మురుగు నీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టారు.

పౌష్టికాహారంపై అవగాహన

దాచేపల్లి, సెప్టెంబరు 9: తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తీసుకునే విధానంపై సోమవారం మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం మాసోత్సవాలలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇచ్చే విధానాన్ని అంగన్‌వాడీకార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వివరించారు. కార్యక్రమాలలో ఈహెచ్ పద్మావతి, శాంతకుమారి, లక్ష్మీ, మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కుటుంబరావుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ అధికారులు

ప్రభుత్వ కార్యాలయాల్లో

పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

దాచేపల్లి, సెప్టెంబరు 9: ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు దాచేపల్లి తహసీల్దార్ కుటుంబరావుకు విద్యుత్‌శాఖ చెల్లింపునకు సంబంధించిన విద్యుత్ బకాయి బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ దాచేపల్లి మండలంలో పంచాయతీరాజ్, ఎండీవో కార్యాలయం, విద్యాశాఖ, ప్రభుత్వ వైద్యశాల, నగర పంచాయతీ, పోలీస్‌స్టేషన్, హౌసింగ్, హాస్టల్స్‌కు సంబంధించిన కరెంటు బిల్లులు రూ.లక్షల్లో పేరుకు పోయినట్లు వివరించారు. ఈవిషయాన్ని ఆయాశాఖల ఉన్నతాధికారులకు నోటీసుల రూపంలో తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఏఏవోపీ సందీప్‌కుమార్, జేఏవో ఆశీర్వాదం, ఉద్యోగులు హమీద్, వేణుగోపాలకృష్ణ, ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు, సెప్టెంబరు 9: పిడుగురాళ్ళ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిర్వహణ నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈఈ బీ.నాగసురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. నకరికల్లు మండల పరిధిలోని నకరికల్లు, గుండ్లపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో త్రీఫేజ్ కరెంటు మంగళవారం తెల్లవారు జామున 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఈ-పంట నమోదుకు 15 తుది గడువు

నకరికల్లు, సెప్టెంబరు 9: ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఈ-పంట నమోదుకు 15వతేదీ తుది గడువు అని ఏవో కే.దేవదాసు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-పంట నమోదు చేసుకోవటం ద్వారా రైతులు పంట నష్టం సంభవించినప్పుడు పరిహారం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులందరూ తాము సాగు చేసిన పంటలను ఈనెల 15వ తేదీ లోపు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయాధికారులు, సహాయకులను సంప్రదించి ఆధార్, పొలం 1బీ, ఫోన్ నెంబరు, బ్యాంక్ పాసు బుక్ జిరాక్స్ అందజేసి నమోదు ప్రక్రియను పూర్తిచేసుకోవాలని దేవదాసు సూచించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 9 : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 43.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 93,998 క్యూసెక్కుల ప్రాజెక్టుకు చేరుతుందని తెలిపారు. ప్రాజెక్టు 3 గేట్ల ద్వారా 87,117 క్యూసెక్కులు, పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

హామీలను అమలు చేయాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 9: టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు భవననిర్మాణ కార్మికులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కన్నా కలిసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమలో సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, నేతలు పలువురు పాల్గొన్నారు.

తెలంగాణా మద్యం స్వాధీనం

బెల్లంకొండ, సెప్టెంబరు 9 : పాపాయపాలెం గ్రామానికి చెందిన ఎం రాంబాబు, పెద్దోడు అనే ఇద్దరు వ్యక్తుల నుంచి 179 సీసాల తెలంగాణా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజా తెలిపారు. ఆదివారం రాత్రి పాపాయపాలెం సమీపంలో గల రుక్మిణీపురం వెళ్ళే రోడ్డులో తన సిబ్బందితో పహారా కాస్తుండగా రాంబాబు, పెద్దోడు 179 తెలంగాణా మద్యం సీసాలను కలిగి ఉండగా వారిని అదుపులోకి తీసుకుని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ

నకరికల్లు, సెప్టెంబరు 9 : చేజర్ల కొండపైన ఉన్న కుమారస్వామి దేవాలయానికి కన్నా రంగయ్య నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు విలువైన ఇన్వర్టర్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వితరణగా అందజేశారు. ఆలయానికి ఇన్వర్టర్ అవసరం ఉందని, పాపిశెట్టి వెంకట కృష్ణారావు, ఆవుల సుబ్బయ్యలు కన్నా దృష్టికి తీసుకు వెళ్ళటంతో స్పందించిన ఆయన ఇన్వర్టర్‌ను అందజేశారు.


ఎమ్మెల్యే కన్నాకు చెక్కును అందజేస్తున్న ఫణిదం గ్రామస్థులు

వరద బాధితులకు ఫణిదం గ్రామస్థుల చేయూత

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని ఫణిదం గ్రామస్థులు వరద బాధితులకు తమ వంతుగా రూ.57,500 నగదును సేకరించి సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు చెక్కు రూపంలో అందజేశారు. గ్రామస్థులతో పాటు ఫణిదం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ద్వారా రూ.20 వేలు చెక్కును కన్నాకు అందజేశారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరద బాధితులకు గ్రామస్థులు తమ వంతుగా సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ కార్యదర్శి ఆరాధ్యుల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, సెప్టెంబరు 9 : పట్టణంలోని షాలోం చర్చిలో సోమవారం జరిగిన సమైక్య కాపరుల సాహవాసం ప్రార్థన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. సమైక్య కాపుల సంఘానికి తన వంతు సహాయ సహకారాలను ఎప్పుడు అందిస్తానని కన్నా తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కన్నాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కన్నాకు అందించారు. నియోజక వర్గానికి చెందిన సంఘ కాపర్లు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ - పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త సయ్యద్ రోడ్డు ప్రమాదానికి గురై గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కన్నా సోమవారం సయ్యద్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 9: జానపాడు పంచాయతీ శివారు ప్రాంతమైన జగ్జీవన్‌రామ్ కాలనీలో దోమల బెడద ఎక్కువగా వున్న ప్రాంతాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని టీడీపీ నేతలు వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, నరసింహారావు, రామకృష్ణ, తదితరులు అధికారులను కోరారు. సోమవారం వారు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. మురుగు కాల్వల్లో చెత్తా చెదారాన్ని తొలగించే విధంగా చూడాలని అధికారులను కోరారు. అదేవిధంగా గుత్తికొండ గ్రామం నుంచి గుత్తికొండ బిళం వెళ్లే రహదారి పక్కనే వున్న పంట కాల్వలో గడ్డి, నాచు, జమ్ము పేరుకు పోయి దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయని, అధికారులు స్పందించి కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు.

ఉచితంగా పశు దాణా పంపిణీ

పెదకూరపాడు, సెప్టెంబరు 9 : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని రైతులకు సంగం డెయిరీ ఆధ్వర్యంలో పశు దాణాను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు మాట్లాడుతూ అకాల వర్షాలకు భారీ స్థాయిలో నష్టాలు జరిగాయన్నారు. ముఖ్యంగా పశువులకు దాణా కొరత ఏర్పడిందన్నారు. ఇందుకోసం పశు దాణాను పంపిణీ చేసినట్లు తెలిపారు. అమరావతి మండలంలోని వైకుంఠ పురం, పెద మద్దూరు, చావపాడు, ఎండ్రాయి గ్రామాల్లోని 265 మంది పాడి రైతులకు, తుళ్ళూరు మండలంలోని హరిశ్చంద్రపురం గ్రామంలోని 42 మంది రైతులకు పశు దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కంచర్ల శివరామయ్య, ప్రసాదు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన

పెదకూరపాడు, సెప్టెంబరు 9: అధిక వర్షాలకు పొలాలు నీట మునిగి పైర పూర్తిగా దెబ్బతినటంతో ఆ పొలాలను లాం ఫాం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. పెదకూరపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట రాములు, ఏరువాక కేంద్రం జిల్లా శాస్త్రవేత్త టీ.అమర జ్యోతి, సీనియర్ శాస్త్రవేత్తలు పలువురు పొలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. పైరుని కాపాడుకునేందుకు చేపట్టాల్సిన రక్షణ చర్యలను, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇంజం శాంతి తదితరులు పాల్గొన్నారు.


సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు స్థిరీకరణ విభాగం

నవజాత శివువులకు అత్యవసర వైద్యసేవలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 9: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు 24 గంటల పాటు అత్యవసర వైద్యసేవలు అందించే సదుపాయలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా నెలలు నిండకుండా పుట్టిన శిశువులు ఆరోగ్యపరమైన సమస్యలు, నిమోనియా, ఇన్‌ఫెక్షన్‌లు, పసికర్లు, ఆయాసం, దగ్గు వంటి వాటికి చికిత్స నిమిత్తం నవజాత శిశువు స్థిరీకరణ విభాగంలో వార్‌మర్లు, ఫోటోథెరపీ యూనిట్ల ద్వారా అవసరమైన చికిత్సలను అందిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లి, పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు ఆయన తెలిపారు. సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు చిన్నారుల వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పూజలు.. నిమజ్జనాలు

- వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు
- భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపులు
- ఉత్సాహంగా లడ్డూల వేలం


బెల్లంకొండవారి పాలెం గ్రామంలో నిమజ్జన ఊరేగింపులో భక్తులు

గణనాథుని నవరాత్రుల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండపాలలోని విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నిమజ్జనోత్సవ కార్యక్రమాలను కోలాహలంగా చేపట్టారు. పుర వీధుల్లో స్వామి వారి విగ్రహ ఊరేగింపులు సాగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి హారుతులు ఇచ్చారు. యువకుల నృత్యాలు చేస్తూ నిమజ్జనంలో సందడి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తులు చర్యలు చేపట్టారు.

మాచర్ల రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో సోమవారం గణేషుని విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం అనుపులోని కృష్ణాజలాశయంలో నిమజ్జనం చేశారు. నిర్వాహకులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిలో సోమవారం సాయంత్రం వరకు 61 వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయగా, బుగ్గవాగులో 7 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన వేలంలో కొలిశెట్టి సాంబశివరావు రూ.71వేలకు లడ్డూని దక్కించుకున్నారు. టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో అన్నదానం చేశారు.

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు నిఖిల్ మంచికల్లు గ్రామంలో పర్యటించి గణపతి మండపంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లెలో 59 కేజీల లడ్డు ప్రసాదానికి సోమవారం వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన అవిరినేడి మధుబాబు రూ. 1.40 లక్షలకు సొంతం చేసుకున్నారు. అనంతరం విగ్రహాన్ని అడిగొప్పులవద్ద సాగర్ కుడి కాలువలో నిమజ్జనం చేశారు.

గురజాలటౌన్: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు నిఖిల్ సోమవారం పట్టణంలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేతలు పలువురు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలో పలు చోట్ల మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినిమాహాలు సెంటర్, 2వ వార్డులోని విగ్రహాలను నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. అశ్విని థియేటర్ సమీపంలో గణపతి సేవా సమితి వినాయక చవితి మండపంలో యరపతినేని సాయి నిఖిల్ పూజలు నిర్వహించారు. జానపాడురోడ్డులోని విఘ్నేశ్వర సేవా దళం మండపం, గణేష్‌సేవా సమితి, రెడ్డియూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. గణేష్ సేవా సమితి మండపంలో లడ్డుని రూ.57వేలకు జొన్నలగడ్డ శ్రీను దక్కించుకున్నాడు.

మాచవరం: వేమవరం గ్రామంలోని లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం వద్ద 50కేజీల లడ్డూకి వేలం నిర్వహిచగా గుమ్మా వెంకటేశ్వర్లుయాదవ్ రూ.50వేలకు దక్కించుకున్నాడు. వేమవరం, మాచవరం,పిన్నెల్లి, మోర్జంపాడు, పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

దాచేపల్లి: నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించగా రూ.11,500 మద్దినేని నరసింహారావు, ఎంఎస్ఆర్ చిల్లీస్ ట్రేడర్స్‌కు చెందిన పులిపాడు గ్రామస్థులు దక్కించుకున్నారు. నిమజ్జన కార్యక్రమాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దాచేపల్లి సీఐ గుత్తి వెంకటరావు పర్యవేక్షణలో ఎస్ఐ శివనాగరాజు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నకరికల్లు: నకరికల్లులో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేషుని విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాళంగి కనక సేవారావు, జవ్వాజి నరసింహా స్వామి, దివ్వెల నరసింహారావు, కాళంగి మధు కుమార్, సుబ్బారావులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: గుంటూరు బ్రాంచ్‌కెనాల్, పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో భక్తులు వినాయకుడిని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సోమేశ్వరరావు, తహసీల్దార్ ఎం భవానీ శంకర్‌లు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

పెదకూరపాడు :స్థానిక మిట్ట సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహం వద్ద ముస్లిం యువకులు షేక్ బాజీ భక్తులకు ప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను చేశారు.


రెంటచింతలలో అమ్మవారి ఆలయంలో లడ్డూ ప్రసాదాన్ని రూ.71 వేలకు దక్కించుకున్న కొలిశెట్టి సాంబశివరావు


నకరికల్లులో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


పెదకూరపాడు మిట్ట సెంటర్‌లోని వినాయకుని విగ్రహం వద్ద భక్తులకు ప్రసాదాన్ని ఏర్పాటు చేసిన షేక్ బాజీ

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట


ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న టీఎన్‌యూఎస్ నాయకులు

సీఎం సహాయనిధికి టీఎన్‌యూఎస్ రూ.4లక్షల విరాళం

నరసరావుపేట టౌన్, చిలకలూరిపేట, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నేతలు విరాళం అందజేశారు. సోమవారం చిలకలూరిపేటకు చెందిన మునిసిపల్ టీచర్ చిలకా వీరయ్య మాస్టారు ఆధ్వర్యంలో టీఎన్‌యూఎస్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విజయవాడలో కలిసి రూ.4లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం దిశగా చంద్రబాబు పాలన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9: సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం దిశగా చంద్రబాబు పాలన సాగుతోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ కేసులో చంద్రబాబు నాయుడు అరెస్టయి ఏడాది అయిన సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేశారు. విజనరీ లీడర్ అక్రమ నిర్బంధానికి నేటితో ఏడాది పూర్తయిందన్నారు. ఒక విజన్ ఉన్న నాయకుడును అక్రమంగా అరెస్టుచేసి, పైశాచిక ఆనందాన్ని పొందిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టు తరువాత, తెలుగు రాష్ట్రాలతోపాటు, ప్రపంచంలోని సుమారు 70 దేశాలలో ప్రజలు సంఘీభావం తెలిపారన్నారు. వైసీపీ అవినీతి, అరాచక, అక్రమ అరెస్టును నిరసించే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.

ధర్మానిదే విజయం: జీవీ

వినుకొండ, సెప్టెంబరు 9: తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్య మంత్రి చంద్రబాబుపై ఏడాది క్రితం ప్రతిపక్షనేతగా ఉండగా నాటి జగన్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అధర్మం, తాత్కాలికంగా గెలవచ్చేమోకాని, అంతిమ విజయం ఎప్పుడూ ధర్మం వైపు ఉంటుందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో జగన్ అదే విషయాన్ని యావత్తుదేశానికి చాటిచెప్పారని, ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు జైలు నిర్బంధాల నుంచి ఫీనిక్స్ పక్షిలా ఎగసి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారన్నారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఏడుగురు బాలికల ఎంపిక

శావల్యాపురం, సెప్టెంబరు 9: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఏడుగురు బాలికలు ఎంపికైనట్లు హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. ఏడుగురు బాలికలకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గుంటూరులోని ఎన్‌జీవో హోంలో ఈ నెల 8వ తేదీన జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన ఇంటర్ మీడియట్ బాలికలు వేముల దివ్య, ముట్లూరి లూథియా, బండారు దేవమణిలు, 10వ తరగతి బాలిక రత్నకీర్తన, 9వ తరగతి బాలికలు బండారు రవళి, ఉప్పు లలిత, చల్లా శ్రీహర్షిత పాల్గొని మంచి ప్రతిభ కనబరచి సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరగనున్న తొమ్మిదవ రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడుగురు బాలికలు ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీ పాఠశాల నుంచి ఒకేసారి ఏడుగురు బాలికలు ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా వీరు బాగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం ఏడుగురు బాలికలను, వారికి మంచి శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడంలో కీలకపాత్ర పోషించిన బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జాయింట్ సెక్రటరీ, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిలను స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, భువనేశ్వరి, రికార్డ్ అసిస్టెంట్ కొడాలి శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 9: ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారం వేదికను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి, వివాహేతర సంబంధాలపై పలు ఫిర్యాదులు వచ్చాయి. దాచేపల్లికి చెందిన ఎం.సౌజన్యను ఓ హోంగార్డు రెండో వివాహం చేసుకొని వేరే స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకొని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. వినుకొండ పట్టణానికి చెందిన నరసింహారావు అతని బంధువు వెంకటేశ్వరరావుకు వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని పది లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీచేశారు.



అఖిలపక్షం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, తదితరులు

బండ్లమోటులో మైనింగ్ కోసం కృషి చేస్తా

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 9: బొల్లాపల్లి మండలం బండ్లమోటు వద్ద మూసివేసిన హిందూస్థాన్ జింక్ సీసపు కర్మాగారాన్ని తిరిగి పునః ప్రారంభించేందుకు నావంతు కృషిచేస్తానని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయం సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ వేలాదిమందికి ఉద్యోగ వసతులు కల్పించిన సీసపు గనిని తిరిగి ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మూతబడిన సీసపు గనిని పునఃప్రారంభించేందుకు అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని, ఎంపీల సాయంతో కేంద్ర మంత్రులతో మాట్లాడి మైనింగ్ ప్రారంభానికి కృషిచేస్తానని అఖిలపక్షం సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు హనుమంతరెడ్డి, బొంకూరి వెంకటేశ్వర్లు, టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, పత్తి పూర్ణ, ప్రజా సంఘాల నాయకులు విజయ్, ఆర్కే నాయుడు, వందనం, షేక్ కిషోర్, సాంబయ్య, షేక్ మస్తాన్, కే మల్లికార్జునరావు, ఆర్టీసీ యూనియన్ నాయకులు సంజీవ్‌రావు, ఆబీబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సచివాలయ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలి

కలెక్టర్ అరుణబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9: ప్రకృతి విపత్తులు నెలకొన్నప్పుడు క్షేత్రస్థాయిలో ఉండే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 50ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కార్యాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉన్నపుడే రాబోయే ప్రమాదాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసి గ్రామాలలో ప్రజా సమస్యలపై స్పందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది కార్యాలయ విధులలో క్రమం తప్పకుండా హాజరై ప్రతిరోజూ మూడు పూటలా అటెండన్స్ వేసేలా చూడాలని ఆదేశించారు. రానున్న రెండు రోజులలో వర్ష సూచనలున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించి, వర్షం, వరద ప్రభావిత ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితిని మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. అధికారులు ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోగా నిబంధనల ప్రకారం పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో కే వినాయకం, జిల్లా అధికారులు, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణబాబు, జిల్లా అధికారులు

తహసీల్దారు కార్యాలయానికి వర్ష భయం

● తాత్కాలికంగా పట్టలతో రక్షణకు యత్నం

● రికార్డుల రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్


తహసీల్దారు కార్యాలయంపై పట్టలు కప్పుతున్న కూలీలు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో దశాబ్దాల క్రితం నిర్మించిన వినుకొండ తహసీల్దార్ కార్యాలయానికి వర్షంతో రక్షణకరువైంది. తహసీల్దారు కార్యాలయం, ట్రెజరీ, పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఒకే సమూహంలో నేటికీ కొనసాగిస్తున్నారు. ప్రధాన కార్యాలయం అయిన తహసీల్దార్ కార్యాలయం పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో కార్యాలయం సిబ్బంది రికార్డులను కాపాడుకోలేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రెవెన్యూ వ్యవస్థ అనేకసార్లు ప్రక్షాళన చేసినప్పటికీ వాటి భవనాల్లో మాత్రం మార్పు కనిపించడంలేదు. అధికారులు విలువైన పత్రాలను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వినుకొండ తహసీల్దార్ కార్యాలయం పైపెంకులు ఊడిపోవడం, విలువైన రికార్డులు తడిచిపోతున్నాయి. పలు కోర్టు కేసుల్లో అవసరమైన రికార్డులు వర్షంతో ఇప్పటికే కొంతపాడయ్యాయి. దీంతో వినుకొండ కార్యాలయంలో ఉన్న రికార్డులను కాపాడుకునేందుకు వేల రూపాయలు వెచ్చించి కార్యాలయాలపై పట్టలు కప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. సోమవారం పలువురు సిబ్బంది ఈ పట్టలను కడుతూ కనిపించారు. వీటికి శాశ్వతంగా పరిష్కారం చూపాలని పలువురు సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. దీనిపై వినుకొండ తహసీల్దార్‌ను వివరణ కోరగా వర్షానికి కార్యాలయంలోనికి నీరు వస్తున్నదని, అందువల్ల రక్షణ చర్యల కోసం కార్యాలయంపై పట్టలు కప్పుతున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు.

కొనసాగుతున్న వినాయక చవితి పూజలు


ఎన్‌జీవో కాలనీలో వినాయకుని దర్శించుకున్న ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, సుబ్బరాయగుప్త తదితరులు


తిరుపతమ్మ గుడి వద్ద వినాయకుని దర్శించుకుని ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జీవీ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన మంటపాల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త ఎన్‌జీవో కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కొండ్రుగుంట కృష్ణ, కోట నాగసుధీర్, గార్లపాటి వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వర్లు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రూ 92 వేలు పలికిన లడ్డు

మండలంలోని పెద్దరెడ్డి పాలెంలో సోమవారం వినాయకుని లడ్డు వేలం నిర్వహించారు. లడ్డును వేలంలో రూ.92 వేలకు అబ్బూరి రంగ బాబు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.44వేలు పలికిన లడ్డు

నాదెండ్ల, సెప్టెంబరు 9 : మండలంలోని గణపవరం గ్రామంలో కోదండ రామస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహం వద్ద లడ్డును తెలంగాణకు చెందిన ఇరిగేషన్ అధికారి ఐనోలు నాగ శివ దక్కించుకున్నారు. 15 కేజీల లడ్డును రూ.44వేలకు వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా 11కేజీల రెండో లడ్డును గణపవరం విఘ్నేశ్వర ట్రాక్టర్స్ యూనియన్ వారు రూ.31వేలకు దక్కించుకున్నారు.

ఊరేగింపులు, నిమజ్జనాలకు బందోబస్తు

నూజెండ్ల, సెప్టెంబరు 9: మండలంలోని గ్రామాల్లో వినాయకుడి ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. కనక తప్పెట్లు, బాణసంచాలతో ఊరేగింపులతో గుండ్లకమ్మ నది వద్ద నిమజ్జనానికి భక్తులు ఉత్సాహంగా తెస్తున్నారు. ములకలూరులో రూరల్ సీఐ బీ ప్రభాకరరావు బందోబస్తును పరిశీలించి సూచనలు చేశారు. సోమవారం రాత్రి వరకు 27విగ్రహాలను ఐనవోలు, ఉప్పలపాడు వద్ద గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేసినట్టు ఎస్ఐ టీవీ కృష్ణారావు తెలిపారు.

● బొల్లాపల్లి: మండలంలో వినాయక మండపాల వద్ద వినాయకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాలకు భారీ విద్యుత్ అలంకరణ చేశారు. భారీగా అన్నప్రసాద వితరరణ జరిగింది. బొల్లాపల్లిలో కురుకురే ప్యాకెట్లతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. వెల్లటూరు కురువ సమీపంలో వినాయకుని నిమజ్జనాలు జరిగాయి.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పాలపాడు రోడ్డులో ఉన్న ఎన్ఆర్‌టీ ప్రైడ్ అపార్టుమెంట్‌లోని వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. వేలంలో దేవుని వస్త్రాలు శ్రీనివాసరెడ్డి రూ.6116లు, బీ పృథ్వీ లడ్డును రూ.17116లకు వేలంలో దక్కించుకున్నారు. నిమజ్జనంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


వినుకొండలో 45 విగ్రహాలు నిమజ్జనానికి...

వినుకొండ టౌన్, సెప్టెంబరు 9: వినాయక పండుగ సందర్భంగా వినుకొండ మండలం, పట్టణంలో మొత్తం 123 విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేయగా, మూడవరోజు సోమవారం 45 విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లినట్లు సీఐ శోభన్‌బాబు సోమవారం తెలిపారు. పండుగ సందర్భంగా రైల్వేస్టేషన్ రోడ్డులోని తిరుపతమ్మ గుడి వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్టేషన్ మొదటి బజారులో చుట్టూరి పద్మావతి సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జొన్నలగడ్డలో ఘర్షణ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని జొన్నలగడ్డలో వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన వినాయక విగ్రహం ఉత్సవాలు ముగించుకుని ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి తరలించే సమయంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించే సమయంలో అల్లరిమూకలు ఊరేగింపు వాహనంపై రాళ్ళు రువ్వారు. దీంతో జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టాడు. పోలీసుల సమక్షంలో వినాయకుని వెంటనే నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ కిషోర్ తెలిపారు.


బొల్లాపల్లిలో కురు కురే ప్యాకెట్లతో గణనాథునికి అలంకరణ


రూ.92 వేలకు లడ్డు దక్కించుకున్న అబ్బూరి రంగబాబు

వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు

● తహసీల్దార్ వేణుగోపాలరావు


లింగంగుంట్లలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కె. వేణుగోపాలరావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు. సోమవారం లింగంగుంట్లలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలో మురుగునీరు, వర్షపునీరు వీధుల వెంట నిల్వ ఉండటంపై తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి కే.వేణుగోపాలరావు పరిశీలించారు. లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్, షాలేంనగర్, బాపనయ్య నగర్, విద్యానగర్, గాంధీనగర్, నుంచి వస్తున్న మురుగునీరు, వర్షపునీరు రాజుపాలెం ఎస్సీ కాలనీవైపు రావడాన్ని ఆయన పరిశీలించారు. తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు యాదల మహానందరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, మండాది ప్రభుదాసు తదితరులు తహసీల్దారుకు కోరారు. జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని తహసీల్దార్ వేణుగోపాలరావు నాయకులకు హామీ ఇచ్చారు.

లింగంగుంట్లలో ప్రత్యేక వైద్యశిబిరం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని లింగంగుంట్లలోని రాజుపాలెంలో సోమవారం ఆరోగ్యవైద్యశాఖ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజుపాలెం కాలనీలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు, అంటువ్యాధులు తలెత్తకుండా గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. వైద్యశిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సురేఖ, సిబ్బంది లావణ్య, తదితరులు పాల్గొన్నారు.


లింగంగుంట్లలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

ప్రకాశం బ్యారేజీపై కుట్రలు చేసిన వారిని వదలకూడదు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 9: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 13.08 లక్షల ఎకరాల్లో సాగునీరు, ఎంతో మందికి తాగునీటిని అందించే వర ప్రదాయిని ప్రకాశం బ్యారేజీపై కుట్రలు చేసిన వారు ఎవరైనా, ఎంతటి స్థాయిలో వారైనా వదిలి పెట్టకూడదని ప్రభుత్వానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. ఓ వైపు వరద గుప్పెట్లో చిక్కుకున్న విజయవాడ నగరాన్ని ఎలా కాపాడాలా? అని ప్రభుత్వం ఆలోచిస్తుంటే గేట్లు కూల్చాలని ప్రయత్నించిన వారి మనస్తత్వాల గురించి ఆలోచిస్తేనే ఆందోళన కలుగుతుందన్నారు. ప్రమాదం తప్పింది కనుక సరిపోయింది, లేదంటే ఆ ప్రమాదాన్ని కూడా రాజకీయం చేసి ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలన్నదే వారి ఉద్దేశంగా కన్పిస్తుందన్నారు. ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టిన బోట్లలో మూడు బోట్లు ఒకరివే కావటం, వారంతా వైసీపీ పెద్దల అనుచరులు, సన్నిహితులు కావటం కాకతాళీయం అనుకోలేమన్నారు. ప్రమాద తీవ్రతను గమనించి క్రిమినల్ కేసులు పెట్టడం మంచిదైందన్నారు. పూర్తి నిజానిజాలు నిగ్గు తేల్చాలన్నారు. విపత్తు సమయంలో అసలు ఇలాంటి ఆలోచనలు వారికి ఎలా వచ్చాయో అర్థం కావటం లేదన్నారు. ఇకపై ఇలాంటి శక్తులపై అన్ని విభాగాల అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.


పంపిణీ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, చదలవాడ పర్యటన

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 9: విజయవాడ వరద ముంపు ప్రాంతాలలో రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో పాటు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం పర్యటించారు. కబేళా సెంటర్, చిట్టి నగర్, ఆర్‌ఆర్ నగర్, చనుమోలు వెంకటరావు బ్రిడ్జి పరిధిలో ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి బాధితులకు పండ్లు, కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. వరద నీటి ముంపు ప్రభావానికి గురైన నివాసంలో బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి నిత్యావసరాలు అందజేశారు. చనుమోలు వెంకటరావు బ్రిడ్జి కింద నీటి నిల్వలు తొలగింపు చర్యలు వేగవంతం చేశారు. అనంతరం నిత్యావసరాల పంపిణీతీరు పరిశీలించారు.

సాధారణ పరిస్థితి వచ్చే వరకు విశ్రమించేది లేదు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 9: ముంపుబారినపడిన విజయవాడ నగరంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులెవ్వరూ విశ్రమించరాదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సహాయక చర్యలను ఒక యజ్ఞంలా భావించి ప్రతి బాధితుడికి సాధ్యమైనంత సాయం అందించాలని ఆయన సూచించారన్నారు. విజయవాడ 45వ డివిజన్‌లోని కబేళా సెంటర్‌లో సోమవారం సీఎం చంద్రబాబు పర్యటించారు. వారం రోజులుగా చంద్రబాబు అక్కడే మకాంవేసి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న ప్రత్తిపాటి బాధితులకు అందుతున్న సాయాన్ని చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా కబేళా సెంటర్‌లో నిత్యవసరాల పంపిణీని సీఎం చంద్రబాబు పరిశీలించారు. వస్తువులన్నీ సరిగా అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటికి సూచించారు. వరద బాధితులకు అవసరమైన సాయాన్ని గురించి ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నారని ప్రత్తిపాటిని అభినందించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ


పాఠశాల హెచ్‌ఎం కామేశ్వరరావు శర్మకు కంప్యూటర్ పరికరాలను అందజేస్తున్న వీరభద్రారెడ్డి

నూజెండ్ల, సెప్టెంబరు 9: మండలంలోని రెడ్డికొత్తూరుకు చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్ పూర్వ విద్యార్థి తుపాకుల వీరభద్రారెడ్డి పాఠశాలకు కంప్యూటర్‌ను వితరణ అందజేశారు. హెచ్‌ఎం ఎస్ కామేశ్వరరావు శర్మకు కంప్యూటర్, స్పీకర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

చోరీకి యత్నించిన నలుగురు వ్యక్తుల అరెస్టు

నాదెండ్ల, సెప్టెంబరు 9: మండలంలోని సాతులూరులో రెండు గృహాల్లో చోరీకి యత్నించిన నలుగురిని నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 27వ తేదీ అర్ధరాత్రి సాతులూరు గ్రామంలోని బేతంచర్ల హనుమంతరావు ఇంటితో పాటు మరో ఇంట్లో చోరీ చేసేందుకు ఎనిమిదిమంది వ్యక్తులు యత్నించారు. బైక్‌లపై వచ్చిన వీరిలో నలుగురిని పట్టుకున్నారు. దొరికిన వారిలో పిడుగురాళ్ళకు చెందిన కొత్తపల్లి ఎలీషా, కుంచపు వెంకట కృష్ణ, నంబూరుకు చెందిన పొదిలి మనోహర్, గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన వంగా గణేష్‌రెడ్డిలు ఉన్నారు. వీరిలో కొత్తపల్లి ఎలిషా, వెంకట కృష్ణలపై గుంటూరు, నల్లపాడు, మేడికొండూరులలో కేసులు ఉన్నాయి. వీరిని ఎస్ఐ పుల్లారావు కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు విధించారు.

11 మంది జూదరుల అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 9: యడ్లపాడు మండలం కొండవీడులో పేకాడుతున్న 11 మందిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు ఊరి వెలుపల నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయంలో పేకాడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. దీనితో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి పేకాడుతున్న 11మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారివద్ద నుంచి రూ.3,270లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారందరిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు... తప్పిన ప్రమాదం


పంట పొలాల్లోకి ఒరిగిన ఆర్టీసీ బస్సు

వినుకొండటౌన్, సెప్టెంబరు 9: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పిన సంఘటన మండలంలోని నాగులవరం వద్ద సోమవారం జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ నుంచి ఒంగోలుకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ప్రమాదవశాత్తు పంటపొలాల్లోకి దూసుకు పోయింది. డ్రైవర్ అప్రమత్తగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లు ప్రయాణికులు తెలిపారు. బస్సులో అధికసంఖ్యలో నాగులవరం వెళ్లే స్కూల్ విద్యార్థులు, అద్దంకి, ఒంగోలు వెళ్లే ప్రయాణికులు ఉన్నారు. ఎవ్వరికీ ఎటువంటి గాయాలు తగలకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సీపీఐ శత జయంతి వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

చిలకలూరిపేట,సెప్టెంబరు 9: ఈ ఏడాది డిసెంబర్ 26 నాటికి సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పార్టీ శత జయంతి వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ సోమవారం కోరారు. చిలకలూరిపేట మండలం వేలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నిర్మాణ క్రమంలో వేలూరు గ్రామ నాయకుల, కార్యకర్తల పాత్ర ముఖ్యమైనదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్చార్జి కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, తాళ్లూరి బాబురావు, కాసా రాంబాబు, రావిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.